సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం ; 5 ; మార్చి ; 2024



స్టేడియంకు మంచి రోజులు

కేఆర్ స్టేడియంకు మంచి రోజులు వచ్చాయి. టెండర్లు పిలవడంతో పనులు ఊపందుకోనున్నాయి.

- 8లో



కోనేటిరాయుడికి..

మందస వాసుదేవుని బ్రహ్మోత్సవాల్లో స్వామి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. పొన్నచెట్టు వాహనంపైనా ఊరేగించారు.

- 8లో

17న జామి జాతర


కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఈ నెల 17వ తేదీ ఆదివారం జామి జాతర నిర్వహించనున్నట్లు ఎల్లమ్మ తల్లి దేవత ఉత్సవ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. జాతరకు సంబంధించి నిర్వాహకులు పోలీసు శాఖ, మున్సిపల్ శాఖ, ఆరోగ్యశాఖ వారితో ప్రత్యేకమైన సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రా-ఒడిశాతో పాటు అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవానికి తరలివస్తారు.

న్యూస్‌రీల్

10న గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ విద్యాలయం కోఆర్డినేటర్ ఎన్. బాలాజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే హాల్ టికెట్లను విడుదల చేశామని పేర్కొన్నారు. జిల్లాలో 5వ తరగతిలో 640 సీట్లకు గాను 1674 మంది విద్యార్థులు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 800 సీట్లకు గాను 1479 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 5వ తరగతి వారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. హాల్ టికెట్లు http:apbragcet.apcfss.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, విద్యార్థులు హాల్ టికెట్లతో పాటు ఆధార్ కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకురావాలని సూచించారు. వివరాలకు 7569788629, 9701736862 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేశామని, ఈ విషయంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీలు తమ దృష్టికి తీసుకు రావచ్చని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. సహాయక పోలింగ్ స్టేషన్లు/స్థానాల మార్పు/ కొత్త పేర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 2357 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పాతపట్నంలో అదనంగా ఒక సహాయ పోలింగ్ కేంద్రాన్ని అవసరం మేరకు ఏర్పాటు చేస్తామన్నారు. పాతపట్నం పోలింగ్ కేంద్రం నంబర్ 291లో 1635 ఓట్లు ఉన్నాయని, 1500 మంది కంటే అధికంగా ఓటర్లు ఉంటే మిగిలిన ఓటర్లకు మరో సహాయక పోలింగ్ కేంద్రం ప్రతిపాదించవచ్చన్నారు. అలాగే ఆమదాలవలస నియోజకవర్గంలో రెండు పాత కేంద్రాలను కొత్త చోటుకి మార్పు చేశామని ఇవి మినహా జిల్లాలో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.

115 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు

పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన పాఠశాలలు అప్‌గ్రేడ్ కారణంగా జిల్లాలో 115 కేంద్రాల పేర్లు మాత్రమే మారాయని, కానీ అవి ఉండే స్థానాలను మార్చలేదని ఈ విషయాన్ని గమనించాలని కోరారు. జిల్లాలో అత్యధికంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 42 పోలింగ్ కేంద్రాల పేర్లు మారగా, శ్రీకాకుళం, పలాస నియోజకవర్గాల్లో ఎలాంటి మార్పులు లేవన్నారు. ఆ తర్వాత నరసన్నపేటలో 25, ఆమదాలవలసలో 22, పాతపట్నంలో 11, టెక్కలిలో 8, ఎచ్చెర్లలో 7 పోలింగ్ కేంద్రాల పేర్లు మారినట్లు వివరించారు. వీటిపై ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో జాబితాను ఆమోదించి పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ పూర్తి చేశామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, రౌతు శంకరరావు, మాధవరావు (వైఎస్సార్ సీపీ), కింజరాపు ప్రసాద్, పి.ఎం.జే.బాబు (టీడీపీ), దేశెళ్ల మల్లిబాబు (కాంగ్రెస్), బిర్లంగి ఉమా మహేశ్వరరావు, సురేష్ బాబు సింగ్(బీజేపీ), డి.గోవింద రావు (సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

'పోస్టల్ బ్యాలెట్స్ చాలా కీలకం'



మాట్లాడుతున్న డీసీఓ బాలాజీ నాయక్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రస్తుత పరిస్థితుల్లో పోస్టల్ బ్యాలెట్లు ఎంతో కీలకమని డీసీఓ బాలాజీ నాయక్, డ్వామా పీడీ చిట్టి రాజు అన్నారు. పోస్టల్ బ్యాలెట్ల తయారీ, జారీ, స్వీకరణలో ఎక్కడా చిన్న పొరపాటు కూడా రాకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా, పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించిన అంశాలపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఫారం 12, ఫారం 13 ఎ బి సి డి లు నింపే ప్రక్రియపై అవగాహన తదితర అంశాల గురించి వీరు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



బుడగట్లపాలెం తీరంలో జోరుగా జరుగుతున్న ఫిషింగ్ హార్బర్ పనులు

వడివడిగా ఆశల హార్బర్



కన్నవాళ్లను, ఉన్న ఊరిని వదిలి వెళ్లే యాతన ఇక ఉండదు. కట్టుకున్న వారికి, కడుపున పుట్టిన వారికి దూరంగా బతికే వేదన ఇక ఉండబోదు. కాసిన్ని రాళ్లు వెనకేసుకోవడానికి సరిహద్దులు దాటి వలస వెళ్లే మత్స్యకారుల బతుకుల్లోని వెతలకు ఇన్నేళ్లకు ఓ ముగింపు రానుంది. ఓ వైపు మూలపేట పోర్టును శరవేగంగా నిర్మిస్తున్న ప్రభుత్వం, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల్లో కూడా జోరు పెంచింది. బ్రేక్ వాటర్ పనులు జరుగుతుండడంతో ఈ నిర్మాణంపై గంగపుత్రులు కోటి ఆశలు పెంచుకున్నారు. అందుకు అనుగుణంగానే సర్కారు పనిచేస్తోంది.

- ఫిషింగ్ హార్బర్ కల సాకారం
- బుడగట్లపాలెంలో జోరుగా పనులు
- జిల్లాలో నిర్మితమవుతున్న మరో చారిత్రాత్మక ప్రాజెక్టు
- వలసల నియంత్రణతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి అవకాశం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: మత్స్యకారుల బతుకులు బంగారం చేస్తూ ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. ఇప్పటికే సంక్షేమ పథకాల రూపంలో గంగపుత్రుల బెంగ తీర్చిన ప్రభుత్వం ఇప్పుడు వలసల నిర్మూలనకు జిల్లాలో కీలక ప్రాజెక్టులను నిర్మిస్తోంది. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో రూ.365.81కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభించింది. ప్రస్తుతం బ్రేక్ వాటర్ పనులు జరుగుతున్నాయి. అంతర్గత రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరికొన్ని కాంక్రీటు పనులు కూడా చేస్తున్నారు. 18 నెలల వ్యవధిలో ఫిషింగ్ హార్బర్‌ను పూర్తి చేసేలా పనులు జోరందుకున్నాయి.

వనరులున్నా.. సదుపాయాల్లేక

జాతీయ స్థాయిలో 40 శాతం విదేశీ మారక ద్రవ్యం మెరైన్ సెక్టార్ నుంచే వస్తోంది. అందులో సిక్కోలు మత్స్యకారుల వాటానే ఎక్కువ. సరాసరి లక్షా 95వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద లభిస్తోంది. ఇంత సంపద వస్తున్నా, జిల్లాలో 194 కిలోమీటర్ల విస్తారమైన తీర ప్రాంతం ఉన్నా మౌలిక సదుపాయాలు లేక మత్స్యకారుల వలసలు వెళ్తున్నారు. జిల్లాలో 11 మండలాల పరిధిలో 145 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. స్థానికంగా వేటకు అనుకూలంగా లేక పొట్ట చేత పట్టుకుని వేరే రాష్ట్రాలకు వలసపోయి కుటుంబానికి దూరంగా బతుకుతున్నారు. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా వంటి ప్రాంతాల్లో మనవారే ఎక్కువగా పనిచేస్తున్నారు. కొన్నిసార్లు సరిహద్దులు దాటి విదేశీ జలాల్లోకి ప్రవేశిస్తున్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల భద్రతా సిబ్బందికి పట్టుబడుతున్నారు. ఎచ్చెర్ల మత్స్యకారులు ఆ మధ్య పాక్ చెరలో చిక్కుకుపోవడమే ఇందుకు నిదర్శనం. ఇప్పుడు ఈ ప్రాజెక్టు పూర్తయితే వలస వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది.



మట్టి రోడ్డు పనులు

అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం

2018 నవంబర్ 27న పాకిస్తాన్ భద్రతా దళాలకు వీరావల్‌లో సముద్ర వేటలో ఉత్తరాంధ్రకు చెందిన మత్స్యకారులు పట్టుబడ్డారు. వీరు 13 నెలలు పాకిస్తాన్ కరాచీ జైలులో గడిపారు. దేశ ద్రోహం కేసులు పెట్టడంతో ఏడాది లోపు విడుదల చేయడం అసాధ్యమైపోయింది. ఏపీ నుంచి పాక్ జైల్లో ఉన్న 20మంది మత్స్యకారుల విడుదల కోసం గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అనేక మార్లు కేంద్రంతో సంప్రదింపులు జరిపి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జై శంకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఆ మంతనాలు ఫలించి మత్స్యకారులు విడుదలయ్యారు. ప్రభుత్వం చొరవతో మత్స్యకారులు విడుదలైనప్పటికీ, వలసలకు ఓ పరిష్కారం చూపాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. దానిలో భాగంగా ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించ తలపెట్టారు. అందులో భాగంగా సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న శ్రీకాకుళం జిల్లాలో ఒక ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని భావించి, యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేశారు. రూ. 361.85కోట్లతో బుడగట్లపాలెంలో నిర్మించాలని నిర్ణయించారు.

త్వరితగతిన పనులు

ఫిషింగ్ హార్బర్ మంజూరు చేసి చేతులు దులుపుకోలేదు. కాగితాలకే పరిమితం కాకుండా కార్యరూపంలోకి తెచ్చారు. గత ఏడాది ఏప్రిల్‌లో శంకుస్థాపన చేశారు. విశ్వ సముద్ర సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించి పనులు కూడా ప్రారంభించారు. 42 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బ్రేక్ వాటర్ పనులు, అంతర్గత రోడ్లు, ప్లాట్ ఫాం, ఇతరత్రా కాంక్రీటు పనులు జోరుగా జరుగుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్ట్ సంస్థ నిమగ్నమైంది. బుడగట్లపాలెంలో ప్రస్తుతం హార్బర్ పనులతో సందడి సందడిగా మారింది.



బుడగట్లపాలెం సముద్రతీరం

ప్రయోజనాలివీ..

- శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాల మత్స్యకారులకు ప్రయోజనం కలగనుంది.
- మత్స్య సంపదకు మంచి మార్కెట్ కల్పించేందుకు హార్బర్ ఉపయోగపడుతుంది.
- చేపలు వేట, ఉత్పత్తి, అమ్మకం పెరుగుతాయి.
- టూరిజం కూడా అభివృద్ధి చెందుతుంది.
- ప్రాంతీయ ప్రగతి సాధ్యపడుతుంది.
- పూర్తిస్థాయిలో మౌలిక వసతులు, రోడ్లు అభివృద్ధి చెందుతాయి.
- మరోవైపు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో రూ.10కోట్లకు పైగా వ్యయంతో నిర్మిస్తున్న జెట్టీని కూడా ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.



బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌లో కాంక్రీట్ పనులు

- అక్కడ కూడా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి చేసుకుంటే జిల్లా వ్యాప్తంగా మత్స్యకారుల వలస కష్టాలు తీరనున్నాయి.
- ఉన్న ఊళ్లోనే ఉపాధిని పొంది, తమ జీవన ప్రమాణాలను మెరుగు పర్చుకునేందుకు అవకాశం ఉంటుంది.

సైకిల్‌పై అయోధ్యకు..



కాకినాడ, భీమవరం, రావులపాలెంకు చెందిన నలుగురు యువకులు సైకిల్‌పై అయోధ్యకు వెళ్తున్నారు. వెంకటేష్, సతీష్, శివ, చైతన్య అనే యువకులు దాదాపు 1700 కిలోమీటర్ల పాటు సైకిల్‌పై ప్రయాణించి శ్రీరాముడిని దర్శించుకోనున్నట్లు తెలిపారు. వీరంతా యూట్యూబర్లు కూడా. వీరు సోమవారం ఇచ్ఛాపురం పట్టణానికి చేరుకొని గ్రామదేవత శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఈ నెల 20వ తేదీ నాటికి అయోధ్యకు చేరుకుంటామని తెలిపారు. - ఇచ్ఛాపురం

ఇంటర్ పరీక్షలకు 890 మంది గైర్హాజరు



జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. సోమవారం సెట్-2 ప్రశ్న పత్రంతో ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఇంగ్లిష్ పేపర్ రాశారు. మూడో రోజు జనరల్ విద్యార్థులు 21,519 మంది హాజరుకావాల్సి ఉండగా 20,748 మంది పరీక్ష రాశారు. 771 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విభాగంలో 1449 మంది హాజరుకావాల్సి ఉండగా 1330 మంది పరీక్ష రాశారు. 119 మంది డుమ్మా కొట్టారు. స్పెషల్ ఆఫీసర్ కె.ప్రకాశరావు, ఆర్ఐఓ పి.దుర్గారావు, డీఈసీ కమిటీ, హైపవర్, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేశారు. -శ్రీకాకుళం న్యూకాలనీ

నేడు, రేపు వర్సిటీలో విబ్రాంట్ విస్టా టెక్నికల్ ఫెస్ట్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళ, బుధవారాల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో విబ్రాంట్ విస్టా టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు తెలిపారు. వర్సిటీలో సోమవారం వివరాలు వెల్లడించారు. కార్యక్రమానికి విశాఖపట్నంకు చెందిన పల్సస్ గ్రూప్ సీఈఓ, వర్సిటీ పాలక మండలి సభ్యులు డాక్టర్ గేదెల శ్రీనిబాబు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజనీతో పాటు పలువురు హాజరు కానున్నారని చెప్పారు. రెండో రోజుల పాటు సాంకేతిక, వినోద, విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. -ఎచ్చెర్ల క్యాంపస్

పోలీసు స్పందనకు 42 ఫిర్యాదులు



మహిళల గోడు వింటున్న ఎస్పీ రాధిక

ప్రజా సమస్యలకు చట్టప్రకారం పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని ఎస్పీ జీఆర్ రాధిక జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి అర్జీదారుల నుంచి 42 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్ పాల్గొన్నారు. - శ్రీకాకుళం క్రైమ్

స్పందనకు 235 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 235 వినతులు అందాయి. కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్ రావు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. -శ్రీకాకుళం పాతబస్టాండ్

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం

జలుమూరు: ప్రఖ్యాత శైవ క్షేత్రం శ్రీముఖలింగంలో ఈ నెల 8 నుంచి 11 వరకూ జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు 300 మందితో పూర్తిస్థాయి బందోబస్తు నిర్వహించ నున్నామని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఆమె సోమ వారం శ్రీముఖలింగం వచ్చి స్వామి దర్శనం చేసు కుని ఏర్పాట్లు పరిశీలించారు. మొదటి రోజు 8న శివరాత్రికి 300 మంది పోలీసులను వినియోగిస్తామని, నాల్గో రోజు 11న స్వామి చక్ర తీర్థ స్నానాలకు అద నంగా మరో 280 మందిని వినియోగిస్తామని తెలిపారు. ప్రధానంగా సామాన్య భక్తులకు స్వామి దర్శనం సులువుగా జరిగేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆలయం ముందు స్వామి దర్శనానికి వచ్చే భక్తులు కాళ్లు కడుక్కునేందుకు నీటి సౌకర్యం ఏర్పా టు చేయాలన్నారు. వీఐపీ బారికేడ్లు, ధ్వజస్తంభం వద్ద భక్తులు ఎక్కువ మంది ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వంశధార నదికి త్రిశూల స్నానాలకు వెళ్లే మార్గం, రహదారి పరిశీలించి పూర్తిస్థాయిలో బందోబస్తు నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాలను ఎక్కడికక్కడ అమర్చాలని ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణను ఒక డీఎస్పీ, నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐల పర్యవేక్షిస్తారని నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు తెలిపారు. ఆమెతోపాటు డీఎస్పీ బాల చంద్రా రెడ్డి, ట్రైనీ డీఎస్పీ సీహెచ్ రాజా, ఎస్ఐ మధుసూదనరావు అర్చకులు, సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

జిల్లాకు కేంద్ర పోలీసు బలగాలు



శ్రీకాకుళం నగరంలో కేంద్ర బలగాల కవాతు

శ్రీకాకుళం క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర పోలీసు బలగాలు జిల్లాకు సోమవారం వచ్చాయి. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు పోలీసు దళాలు, జిల్లా పోలీసు యంత్రాంగం సమన్వయంగా పనిచేయాలని ఎస్పీ జీఆర్ రాధిక పేర్కొన్నారు. కేంద్ర దళాలు రావడంతో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి, డేఅండ్ నైట్ కూడలి మీదుగా పాతబస్టాండు కూడలి వరకు నగర పరిధిలో ఉన్న పోలీసులతో కలిసి ఎస్పీ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర బలగాలకు ఎస్పీ రాధిక స్థానిక పరిస్థితులు వివరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు వై.శృతి, ఎల్.శేషాద్రినాయుడు, సీఐ సన్యాసినాయుడు, కేంద్రబలగాల అధికారులు, సిబ్బంది, ఎస్ఐలు పాల్గొన్నారు.

కొమరం భీముడో.. పాట ప్రత్యేకం

- ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల



ఆదిత్యుని జ్ఞాపికను సుద్దాల అశోక్‌తేజకు అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన తెలుగు సినిమా ఆర్‌ఆర్‌ఆర్‌లో 'కొమరం భీముడో..' పాట అత్యంత వేగంగా కేవలం ఐదు నిమిషాల్లో రాశానని, నిజంగా తనకు ఇదో ప్రత్యేకమని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ఆయన సోమవారం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికి రెండు వేలకు పైగా సినిమా పాటలను రాశానని, ఇందులో ఎన్నో సంతృప్తినిచ్చాయని అన్నారు. వీటిలో 'కొమరం భీముడో..' పాట ప్రత్యేకమని, ఈ పాటకు ఎన్టీఆర్ అభినయం పెద్ద ప్లస్ అయ్యిందని గుర్తు చేశారు. అలాగే మెగాస్టార్ చిరంజీవి ఠాగూర్ చిత్రంలో 'నేను సైతం..' పాటకు తొలిసారిగా జాతీయ స్థాయి ఉత్తమ పాటల రచయితగా అవార్డు తనకు లభించడం ఎప్పటికీ మరువలేనిదన్నారు. తాజాగా ఎందరో నూతన గీత రచయితలు ఇండస్ట్రీకి వస్తున్నారని ఇది శుభపరిణామమని అన్నారు. అంతకుముందు ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు ఇప్పిలి ఫణీంద్ర శర్మ ఆలయ విశిష్టతను వివరించారు. ఆదిత్యుడిని దర్శించుకోవడం నిజంగా తన అదృష్టమన్నారు.

శిల్పకళ అద్భుతం

గార: శ్రీకూర్మం కూర్మనాథుడిని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్ వద్ద గోత్రనామాలతో పూజలు చేయించుకున్నారు. అనంతరం లక్ష్మీసన్నిధి, తాబేళ్లపార్కు, వైష్ణవీ దుర్గాలయం, రెండు ధ్వజస్తంభాలు, ఆకుపసర చిత్రాలు, శిల్పకళను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అద్భుతమైన శిల్పకళ శ్రీకూర్మనాథాలయం సొంతమని, ఎప్పటి నుంచో రావాలని కోరిక ఇప్పటికీ తీరిందన్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్రమహాత్మ్యాన్ని తెలియజేశారు.

క్లుప్తంగా

రూ.1.20 కోట్లతో మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్లు



పాతపట్నం మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.40లక్షతో మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్

పాతపట్నం: నియోజకవర్గంలోని పాతపట్నం, కొసమాల(మెళియాపుట్టి), గొప్పిలి పీఏసీఎస్ పరిధిలోని మూడు చోట్ల మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో వీటిని ఏర్పాటు చేశారు. పాతపట్నం మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.40లక్షలతో షెడ్ నిర్మాణం పనులు చేపడుతున్నారు. అలాగే మెళియాపుట్టి మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.40లక్షలు, గొప్పిలిలో రూ.40లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నారు. ఈ భవనాలు పూర్తయితే ఒక్కో భవనంలో రైతులకు 500 మెట్రిక్ టన్నుల స్టోరేజ్ చేసుకోవచ్చునని మార్కెట్ శాఖ డీఈఈ ఈ కోటయ్య తెలిపారు.

పరిహారం అందజేత



శాంతికుమారికి పరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: జనవరి 27వ తేదీన భీమిలిలో జరిగిన సిద్ధం సభకు వెళ్తూ ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం గ్రామానికి చెందిన ప్రైవేటు బస్సు క్లీనర్ ఉప్పాడ లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయనకు పార్టీ తరఫున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేశారు. రూ.రెండు లక్షలు నగదును మృతుని భార్య ఉప్పాడ శాంతి కుమారికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ రణస్థలం క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పైడి త్రిమూర్తులు, నాయకులు ఉన్నారు.

క్రీడాకారిణికి అభినందనలు



క్రీడాకారిణిని అభినందిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన ఖేలో ఇండియా ఉషు క్రీడలో కాంస్యం సాధించిన ముద్దాడ శిరీషను సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ అభినందించారు. ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తదితరులు ఉన్నారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు




పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

పాతపట్నం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు పాతపట్నం, మెళియాపుట్టి మండలం వసుంధర చెక్‌పోస్టుల వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపడుతున్నామని పాతపట్నం సీఐ నల్లి సాయి తెలిపారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సరిహద్దు చెక్‌పోస్టులో సోమవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశారని, ఒక్కో చెక్‌పోస్ట్ వద్ద ఒక ఎస్‌ఐతో పాటు నలుగురు కానిస్టేబుల్లను నియమించామన్నారు. ఒడిశా నుంచి వచ్చే వాహనాలు, ఆంధ్ర నుంచి వెళ్లే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు.

మహిళకు మూడేళ్ల జైలు శిక్ష

పొందూరు: మండలంలోని లక్ష్మీపేట గ్రామానికి చెందిన ఓ మహిళపై రాజాం కోర్టులో నేరారోపణ రుజువు కావడంతో అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఎం.బాబు శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. ఆ మేరకు ముద్దాయికి మూడేళ్లు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. లోలుగు గ్రామానికి చెందిన రాంబోతు దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోర్టులో చార్జిషీటు ఫైల్ చేయగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.ఉషకిరణ్ వాదనలు వినిపించారని పొందూరు సబ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న 300 మద్యం సీసాలు సీజ్



మద్యం సీసాలతో ఎస్‌ఈబీ సిబ్బంది

పొందూరు: మండలంలోని బాణాం గ్రామం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 300 మద్యం సీసాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు. మద్యం సీసాలు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు.. ఎస్‌ఈబీ ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో దాడి చేసి బాణాం సమీపంలో ద్విచక్ర వాహనంపై 300 మద్యం సీసాలను తరలిస్తున్న పెద్దింటి ముకుందరావును పట్టుకున్నారు. మద్యం సీసాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కేఆర్ స్టేడియంకు మంచి రోజులు



కోడిరామ్మూర్తి స్టేడియ ప్రాంగణంలో కొనసాగుతున్న 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ పనులు

- రూ.12 కోట్లతో టెండర్లు పిలవడంతో త్వరలో పూర్తిస్థాయిలో పనులు మొదలు
- ఇప్పటికే మొదలైన రన్నింగ్ ట్రాక్ పనులు



ప్రత్యేకంగా సిద్ధమవుతున్న 100 మీటర్ల ట్రాక్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకేంద్రంలోని ప్రతిష్టాత్మక కోడి రామ్మూర్తి స్టేడియంకు మంచి రోజులు వచ్చాయి. స్టేడియం ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో మొదలుకానున్నాయి. మంత్రి ధర్మాన ప్రసాదరావు కృషి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో కేఆర్ స్టేడియంలో నిలిచిపోయిన పనులకు అవసరమయ్యే రూ.12 కోట్ల నిధులను ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేయడంతోపాటు పరిపాలనాపరమైన అనుమతులు సైతం మంజూరు చేసింది. తాజాగా టెండర్లు కూడా పిలవడంతో అతిత్వరలో పనులు మొదలు కానున్నాయి.

గతమెంతో ఘనం.. గత పాలకుల శాపం

1983లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతులమీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రారంభమైంది. మల్టీపర్పజ్ స్టేడియంగా అన్ని క్రీడలను ఆడే విధంగా అవకాశం కల్పించారు. సుమారు 17వేల మంది ప్రేక్షకులు పోటీలను తిలకించేలా గ్యాలరీలను నిర్మించారు. దానికి మరికొన్నాళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి ఇండోర్ క్రీడాంశాలకు ఉపయుక్తంగా కోడిరామ్మూర్తి ఇండోర్ స్టేడియంను సైతం నిర్మించారు. వందలాది మంది అంతర్జాతీయ, జాతీయస్థాయి ఆటగాళ్లతోపాటు శ్రీకాకుళంను ప్రపంచపటానికి పరిచయం చేసిన కరణం మల్లేశ్వరి, పూజారి శైలజ వంటి క్రీడాకారిణులు ఓనమాలు దిద్దుకున్నది కోడిరామ్మూర్తి స్టేడియంలోనే. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం స్టేడియం నిర్మాణాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. గత పాలకుల పాపం క్రీడాకారుల పాలిట శాపంగా మారిపోయింది.

కమీషన్ల కోసం అచ్చెన్న కక్కుర్తి.. పనులకు శాపం

2016 మే 2వ తేదీన స్వయంగా నాటి సీఎం చంద్రబాబునాయుడు స్టేడియం పనులకు శిలాఫలకం వేసి వదిలేశారు. దానికి దాదాపు రెండేళ్ల తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టుల కేటాయింపులో నాడు క్రీడల మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు అన్నీ తానై చక్రం తిప్పారు. కమీషన్ల కోసం తమకు అనుకూలమైనవారికే కాంట్రాక్టు పనులను కట్టబెట్టారు. దీంతో పనులు నత్తనడకన సాగేవి.

ధర్మాన కృషి.. సీఎం చొరవ..

2022 జూన్ 27వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇదే స్టేడియం వేదికగా అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. అదే వేదికపై స్టేడియం పునర్నిర్మాణానికి ధర్మాన కోరిక మేరకు రూ.12 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా టెండర్లను పిలిచారు. దీంతో మరికొద్దిరోజుల్లో క్రీడాకారుల కష్టాలకు చెక్ పడనుంది.

రన్నింగ్ ట్రాక్ పనులు మొదలు

స్టేడియంలో రన్నింగ్ ట్రాక్ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. 400 మీటర్ల పటిష్టమైన రన్నింగ్‌ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నారు. 8 లైన్లతో ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 100 మీటర్ల ట్రాక్‌ను సైతం ఇందులో భాగంగానే ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు. చిప్స్, ఇసుక, మట్టి ఇలా మూడు లేయర్లతో ట్రాక్‌ను పూర్తిచేయనున్నారు. మరికొద్ది రోజుల్లో రన్నింగ్ ట్రాక్‌ను క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పేర్కొన్నారు.



● **వేతనదారుల్లో ఒకరిగా..**

జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ సామాన్యుల్లో సామాన్యురాలిగా కలిసిపోతున్నారు. సోంపేట మండలంలోని బేసిరామచంద్రాపురం గ్రామంలో ఉపాధి వేతనదారులతో ఇలా మమేకమయ్యారు. ఎండకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సరాసరి వేతనం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలు వివరించి మళ్లీ అండగా నిలవాలని కోరారు. - సోంపేట

సమస్యల పరిష్కారానికే మేం ఉన్నాం

- గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో మంత్రి అప్పలరాజు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రజలు చెప్పే సమస్యలను పరిష్కరించేందుకే తాము ఉన్నామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన అక్కుపల్లి గ్రామంలో సోమవారం 'గుడ్ మార్నింగ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉద్దానం, తీర ప్రాంతంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలకు రూ. 100 కోట్లు వ్యయంతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు రూ.700 కోట్లతో ఇంటింటికి శుద్ధజలం అందించే పథకాన్ని సీఎం వైఎస్ జగన్ నిర్మించారని అన్నారు. నాడు–నేడు పథకం ద్వారా బడులను ఆధునికీకరించి పిల్లలకు అన్ని సదుపాయాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు సైతం ప్రభుత్వ పాలన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా చేరువ చేశారని చెప్పారు. ఆయనను మళ్లీ సీఎం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాం



గాజులకొల్లివలస లే అవుట్‌లో ఇళ్లను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుని పనిచేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి గాజులకొల్లివలస, తిమ్మాపురం లే అవుట్‌లలో, మండలంలోని సైలాడ లే అవుట్‌లో పనులు పూర్తి చేసిన ఇళ్లను ఆయన సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో 8978 గృహాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అర్హులందరికీ ఇళ్లు అందజేశామని చెప్పారు. సంక్షేమాన్ని చూసి ప్రజలంతా రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సైలాడ దాసు నాయుడు, గోవిందరావు మొండేటి కుర్మారావు, సంపతి రావు రామారావు, మెట్ట చక్రధర్ రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాస రావు, మండల సచివాలయాల కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు, మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, చింతాడ వెంకటరమణ, పార్టీ నాయకులు దామోదరరావు, రౌతు శ్రీనివాసరావు, గొంటి కృష్ణ, సాధు చిరంజీవి, చిన్నారావు మామిడి రమేష్, పొదిలాపు తిరుపతి, కుప్పిలి సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు పార్టీ నాయకులు కార్యకర్తలు, అధికారులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ శాఖకు లైన్‌మెన్లే కీలకం'



మాట్లాడుతున్న ఎస్‌ఈ కృష్ణమూర్తి

అరసవల్లి: విద్యుత్ శాఖకు క్షేత్ర స్థాయిలో లైన్‌మెన్లే కీలకమని, వీరి బాధ్యతాయుత విధులతోనే నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందజేస్తున్నామని ఈపీడీసీఎల్ ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. సోమవారం ఓ ప్రైవేటు హాల్‌లో నిర్వహించిన విద్యుత్ లైన్‌మెన్ల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలిసారిగా అభినందోత్సవాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు పేరిట జూనియర్ లైన్‌మెన్లను నియమించడంతో సంస్థకు సిబ్బంది కొరత తీరిందని అన్నారు. అంతకుముందు ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు మాట్లాడుతూ లైన్‌మెన్లు అంకిత భావంతో పనిచేస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ బగ్గు రాంబాబు, ఈపీడీసీఎల్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయ సాగు విస్తరించాలి'




శిక్షణలో మాట్లాడుతున్న రిసోర్సు పర్సన్ కె.కృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయ సాగు విస్తరించాలని ప్రకృతి వ్యవసాయ రిసోర్సు పర్సన్, మాస్టర్ ట్రైనర్ కె.కృష్ణ అన్నారు. ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో సోమవారం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకులు 'కృషి సఖి'లకు ఐదు రోజులు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిక్షణలో రెండు రోజులు థియరీ, మూడు రోజులు వ్యవసాయ క్షేత్రాల సందర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. రిసోర్స్ పర్సన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రచారం కోసం జిల్లాలో 30 మండలాలకు 90 మంది కృషి సఖిలను నియమించినట్లు తెలిపారు. మండలం యూనిట్‌గా ప్రకృతి వ్యవసాయ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. రసాయనాలు, పురుగు మందు వినియోగించడం తగ్గించడం, యాజమాన్య ఖర్చులు తగ్గించడం, హానికరం కాని ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యమని చెప్పారు. యాజమాన్య పద్ధతులపై పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు రమణ, ప్రాంతీయ సాంకేతిక శిక్షకులు హేమసుందర్ పాల్గొన్నారు.

'ఓటు నమోదు దరఖాస్తులు పరిష్కరించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్తగా ఓటు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ స్పష్టం చేశారు. గత 30 రోజుల పైబడి పెండింగ్‌లో ఉన్న మార్పులు, చేర్పులు ఇతర సవరణల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన వెంటనే పూర్తి చేసి తదుపరి దశకు పంపించాలని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఆయన జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులతో సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, రీ వెరిఫికేషన్, ఎన్నికలు, ఆరోగ్య శ్రీ, 15వ ఆర్థిక సంఘ నిధుల వినియోగం, వేసవి నీటి ఎద్దడికి పరిష్కార మార్గాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పనలో ఆలస్యం చేయరాదని, ఇంకా మిగిలి ఉన్న 285 చిన్న పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. దరఖాస్తులు సుమారుగా 30 రోజుల పైబడి పెండింగ్‌లో 4334 ఉన్నాయని వీటి పరిష్కారానికి తక్షణమే స్పందించాలన్నారు. నవరత్నాలు పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రగతిలో వెనుక బడిన అధికారులను వివరాలు అడిగారు. సాంకేతిక సమస్యలు లేవని స్పష్టం చేశారు. రెండు మూడు రోజుల్లో అన్ని రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ వెరిఫికేషన్‌కు సంబంధించి రెండు వారాల కిందట జరిగిన ఇదే సమావేశం అనంతరం సాధించిన ప్రగతిపై తహసీల్దార్లకు సూచనలు చేశారు. ఆరోగ్య శ్రీ యాప్ డౌన్ లోడ్, ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డులు పంపిణీపై మాట్లాడుతూ 5,71,691 కార్డులు జిల్లాకు చేరగా 95 శాతం కార్డులు పంపిణీ పూర్తి చేశారని, మిగిలిన కార్డులను రెండు రోజుల్లో లబ్ధిదారులకు అందజేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులు ఇప్పటికి రూ.38 కోట్లు ఖర్చు చేశారని ఇంకా రూ.23 కోట్లు రానున్న పది రోజుల్లో వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఐదు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు హవా కనబరిచారు. ఈనెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన 3వ ఏపీ రాష్ట్రస్థాయి సబ్–జూనియర్స్ బాలబాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచారు.

అలాగే ఈ పోటీల్లో ఎస్.దేవిశ్రీప్రసాద్ బంగారు పతకం సాధించగా, ఎ.రామ్‌చరణ్‌రెడ్డి, ఎం.దినేష్ రజత పతకాలు, వినయ్, వరుణ్‌లు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించి జిల్లా చేరుకున్న వీరిని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు సోమవారం అభినందించారు. వీరిని తీర్చిదిద్దుతున్న కోచ్ పి.ఉమామహేశ్వరరావును మెచ్చుకున్నారు. జాతీయ పోటీలకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కోచ్ రాజీవ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: గత నెల 27న ప్రారంభమైన ఏపీ టెట్–2024 జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతోంది. సోమవారం ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 100 కి 92, రెండో షిఫ్టులో 100 కి 94 మంది హాజరయ్యారు. చిలకపాలేంలో శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టుకు 100 కి 94, రెండో షిఫ్టుకు 100 కి 90 హాజరయ్యారు. మొత్తం 400 మందికి గాను 370 మంది హాజరయ్యారు. ఇప్పటి వరకు 2868 మందికి గాను 2614 మంది హాజరయ్యారు.

డ్రైవింగ్ స్కూల్ కొత్త బ్యాచ్ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో నూతన బ్యాచ్ ప్రారంభిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏపీఎస్‌ఆర్టీసీలో మాత్రమే హెవీ డ్రైవింగ్ స్కూల్ ఉందన్నారు. గతంలో రిలీవ్ అయిన బ్యాచ్‌లో ప్రతి ఒక్కరికి కొత్త విధానంలో లైసెన్స్ ఇప్పించామన్నారు. ఆసక్తి గల వారు వివరాల కోసం 9963091999, 7382923293 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గిన్నెల విక్రయానికి వచ్చి..



అరెస్టయిన మహిళలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కేంద్రంలో ఉన్న పంచాయతీ కార్యాలయానికి చెందిన గోదాంలో చోరీకి పాల్పడిన తెలంగాణకు చెందిన ఏడుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన మహిళలు కలిమెలలో పగటి సమయంలో గిన్నెలు తదితర సామగ్రి అమ్ముకుంటూ వేర్వేరు స్థావరాల్లో తలదాచుకునేవారు. ఈ నేపథ్యంలోనే స్థానిక పంచాయతీ కార్యాలయానికి చెందిన గోదాంలో ఆదివారం సెలవు కావడంతో సిబ్బంది ఎవరూ ఉండరని గమనించి, సిలిండర్లు, పైపులు దొంగలించేందుకు యత్నించారు. అయితే స్థానికంగా ఉన్న ఒక మహిళ చూసి వెంటనే కార్యాలయం అధికారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. ఆ శాఖ ఇంజినీర్ సుకుమార్ ప్రధాన్ కలిమెల పోలీసులకు సమాచారమిచ్చారు. కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో వెళ్లి చోరీకి పాల్పడుతున్న మహిళలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దొంగిలించిన సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో వరంగల్ జిల్లా బంజారుపల్లి గ్రామానికి చెందిన దాసరి నాయమ్మ, కరీంనగర్ జిల్లా దుబ్బపల్లి గ్రామానికి చెందిన దాసరి రెబికా, దుబ్బపల్లి గ్రామానికి కందల సుబ్రత, కొత్తగూడెం జిల్లా చీరాల గ్రామానికి చెందిన కందల మహేశమ్మ, కొత్తగూడెం జిల్లా చీరాల గ్రామానికి చెందిన కందల తిరుపతమ్మ, మంచిర్యాల జిల్లా లక్ష్యయిపేటకి చెందిన బల్లని వెంకటమ్మ, వరంగల్ జిల్లా జనగాపల్లికి చెందిన వనం రేణుక ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో సోమవారం హాజరుపరిచారు.

● కోనేటిరాయుడికి కోటి దండాలు



పొన్నచెట్టు వాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీవాసుదేవుడు



గోపాలసాగరంలో తెప్పలో విహరిస్తున్న వాసుదేవస్వామి

మందస వాసుదేవుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి పొన్నచెట్టు వాహనంలో ఊరేగారు. శ్రీమన్నారాయణుడు సర్వాంతర్యామి అని శ్రీత్రిదండి దేవనాథరామానుజ జీయర్‌స్వామి అన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలపించిన భక్తి కీర్తనలకు భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం గోపాలసాగరంలో స్వామి తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. - మందస